క్లుప్తంగా

హెల్మెట్ ధరించండి



వాహనదారులతో హెల్మెట్ ధరింపజేస్తున్న ట్రాఫిక్ సీఐ మహబూబ్ బాషా

రాయచోటి టౌన్ : స్కూటర్ నడిపేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించి వెళ్లండి అంటూ ట్రాఫిక్ సీఐ మహబూబ్ బాషా ద్విచక్రవాహనాలు నడిపే వారికి సూచించారు. బుధవారం రాయచోటి పట్టణంలోని పలు ప్రధాన కూడళ్ల వద్ద హెల్మెట్ లేకుండా స్కూటర్ నడుతున్న వారిని ఆపి వారికి హెల్మెట్ తప్పకుండా ధరించాలని కోరారు. మీ భద్రతే మా బాధ్యత.. మీరు గమ్యస్థానాన్ని సురక్షితంగా చేరుకోవడమే మా ధ్యేయం అంటూ వాహనదారులకు తెలియజేశారు. హెల్మెట్ లేని వారికి అక్కడిక్కడే కొనుగోలు చేయించి వారితో ధరింపచేసి పంపించారు.

ముగిసిన పది పరీక్షలు



పరీక్ష కేంద్రం నుంచి వెలుపలకు వస్తున్న విద్యార్థులు

నందలూరు(రాజంపేట) : పదో తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో బుధవారం ముగిశాయి. పాటూరు, నాగిరెడ్డిపల్లె, నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, ఆడపూరులోని అంబేడ్కర్ సంక్షేమ గురుకుల పాఠశాలలో పరీక్షా కేంద్రాలు కొనసాగాయి. చివరిరోజు సోషల్ పరీక్షను విద్యార్థులు రాశారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ ఆధ్వర్యంలో 144 సెక్షన్‌ను అమలు చేశారు. పరీక్షలు ముగియడంతో విద్యార్థులు ఉల్లాసంగా, ఉత్సాహంగా ఇళ్లకు వెళ్లారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న తహసీల్దార్ శేషగిరిరావు

ఓబులవారిపల్లె : ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ శేషగిరి రావు పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ భూములలో మిషన్‌లు, జేసీబీలతో కబ్జాలకు పాల్పడితే వారిపై చర్యలు తీసుకొని వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. పెద్దఓరంపాడు రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ స్థలంలో హెచ్చరికల బోర్డును ఏర్పాటు చేశామని, దానిని తొలగించిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

సూచిక బోర్డులు తప్పనిసరి

కలకడ : జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు అత్యంత ప్రమాదకర మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సీఐ శ్రీనివాసులు సూచించారు. బుధవారం చిత్తూరు–కర్నూలు 40వ నంబర్ జాతీయరహదారిపై కలకడ, కె.వి.పల్లె, కలికిరి, పీలేరు మార్గమధ్యంలో అత్యంత ప్రమాదకర మలుపులు ఉన్న ప్రదేశాలను గుర్తించి సమీక్షించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో పీలేరు మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ విజయకుమారి, ఎస్ఐ రామక్రిష్ణారెడ్డి, జాతీయరహదారి కడప ఏఈఈ రఘు, చిత్తూరు ఏఈఈ ప్రసన్నయాదవ్ పాల్గొన్నారు.

తాగునీటిని పొదుపుగా వాడుకోవాలి

పెద్దమండ్యం : వేసవిలో తాగునీటి సమస్యను ఎదుర్కోవడానికి ప్రజలు తాగునీటిని పొదుపుగా వాడుకొనేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ సి వెంకటరమణయ్య అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. వేసవిలో తాగునీటి సమస్యను ఎదుర్కోవడానికి పల్లెల్లో ప్రజలకు తాగునీటిని పొదుపుగా వాడుకోవడంపై అవగాహన కల్పించాలన్నారు. త్రీఫేజ్ సరఫరా ఉన్నంత సేపు తాగునీటి పథకాలను వదలకుండా ప్రణాళిక రూపొందుంచు కోవాలన్నారు.

కురబలకోట జాతరకు ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ : కురబలకోట దండు మారెమ్మ జాతరకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. శనివారం తొమ్మిది బస్సులు, ఆదివారం 25 ప్రత్యేక బస్సులు నడుపుతామన్నారు. సాధారణ చార్జీలతో జాతర స్పెషల్ నడుస్తాయన్నారు.

మద్యం పట్టివేత

బి.కొత్తకోట : మద్యాన్ని అక్రమంగా విక్రయిస్తుండగా దాడులు నిర్వహించి నిందితున్ని పట్టుకున్నామని పోలీసులు బుధవారం తెలిపారు. స్థానిక బీసీకాలనీకి చెందిన అలీసాబ్ (55) కర్ణాటక మద్యం తీసుకొచ్చి విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకుని దాడులు నిర్వహించి 1.08 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకుని నిందితున్ని అరెస్ట్ చేసినట్టు పోలీసులు తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

రాజంపేట ఆర్డీఓ మోహనరావు



సుండుపల్లెలో నీటి సమస్య పరిష్కార చర్యలను వివరిస్తున్న ఆర్డీఓ మోహనరావు

సుండుపల్లె(రాజంపేట) : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో తాగునీటి సమస్యల పరిష్కారానికి పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామని రాజంపేట రెవెన్యూ డివిజనల్ అధికారి మోహనరావు అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వీఆర్‌ఓలు, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ కార్యదర్శులతో తాగునీటి ఎద్దడి నివారణ చర్యలపై నిర్వహించిన సమావేశానికి ఆర్డీఓ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పలు గ్రామాల్లో మంచినీటి సమస్య యుద్ధప్రాతిపదికన గుర్తించాలన్నారు. పైపులైన్ లీకేజీలకు వెంటనే మరమ్మతులు చేయాలన్నారు. గ్రామాల్లో నీటి వనరులను గుర్తించాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య అనేది లేకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ముఖ్యంగా గ్రామాల పరిధిలో మంచినీటి సమస్య పరిష్కారానికి సచివాలయం సిబ్బందికి బాధ్యతలను అప్పగించడం జరుగుతుందన్నారు. గ్రామ పరిధిలో మంచినీటి సమస్య ఉత్పన్నం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత కేటాయించిన సచివాలయ సిబ్బందికి ఉంటుందన్నారు. సమావేశంలో ఎంపీడీఓ అమరనాథ్, తహసీల్దారు జరీనాబేగం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. కాగా 25 ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు ఉన్నట్లుగా అధికారులు ఆర్డీఓ దృష్టికి తెచ్చారు.

నీటి సరఫరాలో జాప్యం జరిగితే చర్యలు

రాయచోటి అర్బన్ : వేసవిని దృష్టిలో ఉంచుకుని రాయచోటి పట్టణం నీటి సరఫరాలో ఎలాంటి జాప్యం తలెత్తకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వాసుబాబు ఇంజినీరింగ్ అధికారులు, నీటి సరఫరా సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆయన మున్సిపల్ అధికారులతో కలసి ఎస్ఎన్ కాలనీ, గర్ల్స్‌హైస్కూల్, ఎన్‌జీఓ కాలనీ, రాయుడు కాలనీ, మాసాపేటల్లోని నీటి సరఫరా ట్యాంకులను పరిశీలించారు. ట్యాంకుల నీటి నిల్వ సామర్థ్యం, ఎంతమేర నీటిని నింపుతున్నారు తదితర వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఎన్నో వ్యయ ప్రయాసలు కూర్చి గాలివీడు మండలం వెలిగల్లు వాటర్ స్కీం నుండి మంచి నీటిని పట్టణంలోని 6 ఈఎల్ఎస్ఆర్ (మంచినీటి ట్యాంకుల) ద్వారా ప్రజలకు నీటినందిస్తున్నామన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తెరిగి అనవసరంగా నీటిని వృథా చేయవద్దని విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ సిబ్బంది ప్రతి 15రోజులకు ఒక్కసారి క్రమం తప్పకుండా ప్రతి నీటి నిల్వ ట్యాంకును బ్లీచింగ్ పౌడర్‌తో శుభ్రపరచాలంటూ ఆదేశించారు. అనంతరం మున్సిపల్ నీటి సరఫరా కార్మికుల హాజరు పట్టికను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఆయన వెంట మున్సిపల్ ఆర్ఐ మల్లికార్జున, పిట్టర్ రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.



రాయచోటి అర్బన్ నీటి సరఫరా ట్యాంకులను పరిశీలిస్తున్న కమిషనర్ వాసుబాబు

ముస్లిం మహిళలకు రంజాన్ తోఫా పంపిణీ



ముస్లిం మహిళలకు తోఫాను పంపిణీ చేస్తున్న యర్రపురెడ్డి కుటుంబసభ్యులు

సుండుపల్లె (రాయచోటి టౌన్) : సుండుపల్లె మండల కేంద్రంలో ముస్లిం మహిళలకు రంజాన్ తోఫాను అందజేశారు. బుధవారం మండల పరిధిలోని సుండుపల్లె మాజీ సర్పంచ్ యర్రపురెడ్డి నిర్మలమ్మ జ్ఞాపకార్థం ఆమె వారసులు యర్రపురెడ్డి శరత్‌గిరిరెడ్డి ఆధ్వర్యంలో తోఫాను పంపిణీ చేశారు. పవిత్ర రంజాన్ సందర్భంగా అందరూ సంతోషంగా పండుగ నిర్వహించుకోవాలని తోఫాను అందిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకుడు రహిమాన్ ఖాన్, యర్రపురెడ్డి జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి



అవగాహనా ర్యాలీని ప్రారంభిస్తున్న అధికారులు

చిన్నమండెం : ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఆనంద్‌కుమార్, ఎంపీడీఓ రామకృష్ణలు అన్నారు. బుధవారం మండల పరిధిలోని దిగువగొట్టివీడు గ్రామ పరిధిలో ఓటర్లకు అవగాహనా ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటు హక్కు వజ్రాయుధమని, ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడి వర్కర్లు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ప్రారంభమైన పాలేటమ్మ జాతర



పూజలందుకున్న పాలేటమ్మ



అమ్మవారికి సిద్దల బోనాలను సమర్పించిన దృశ్యం

చిన్నమండెం : మండల పరిధిలోని కేశాపురం గ్రామ పంచాయతీ దేవలంపేటలో వెలసిన పాలేటమ్మ జాతర మహోత్సవం బుధవారం సిద్దల బోనాలతో వైభవంగా ప్రారంభమైంది. చుట్టుపక్కల గ్రామ పంచాయతీల ప్రజలు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. సిద్దల బోనాలను అమ్మవారికి సమర్పించి అమ్మవారిని శాంతింపజేశారు. రాత్రికి నిండు తిరునాల గురువారం మైలు తిరునాల జరుగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భద్రతా ఏర్పాట్లను చేశారు.

వివాహ వేడుకలో పాల్గొన్న గడికోట



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

లక్కిరెడ్డిపల్లె : పీఎస్ వెంకటసుబ్బయ్య కుమార్తె వివాహ వేడుకలో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డిలు పాల్గొన్నారు. బుధవారం రాయచోటి రాజధాని కల్యాణ మండపంలో జరిగిన ఈ వేడుకల్లో వారు వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలియజేశారు. వీరితోపాటు అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షులు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, రామాపురం మాజీ మండల అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, లక్కిరెడ్డిపల్లె మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథరెడ్డి, మాజీ ఎంపీపీ అంబాబత్తిన రెడ్డయ్యలు వివాహ వేడుకలో పాల్గొన్నారు.

నేటి నుంచి క్రైస్తవ పవిత్ర దినాలు

దైవ సేవకుడు దేవ సహాయం

కడప కల్చరల్ : గురువారం నుంచి మూడు రోజులను అత్యంత పవిత్రమైన దినాలుగా క్రైస్తవ లోకం భావిస్తుందని మాసాపేట సెయింట్ జాన్ చర్చి విచారణ గురువులు రెవరెండ్ పాదర్ గుడిమే దేవ సహాయం తెలిపారు. మాసాపేటలోని తన కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ పాస్కా పవిత్ర వారంలో నిర్వహించనున్న సంప్రదాయ కార్యక్రమాల గురించి వివరించారు. పరిశుద్ధ కార్యక్రమాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయని, క్రైస్తవులు ఆరోజున క్రీస్తు అనుభవించిన శ్రమలకు సాక్షిగా నిలవాలని ఆహ్వానించారు. పవిత్ర గురువారం రోజు 12 మంది శిష్యుల పాదములు కడుగుట, కడరాత్రి భోజనము, దివ్య సత్ప్రసాద స్థాపన, అర్ధరాత్రి 12 గంటల వరకు పరిశుద్ధ ఆరాధన నిర్వహిస్తామన్నారు. శుక్రవారం మాసాపేట అంథోని నగర్ నుంచి కల్వరి యాత్రను నాటక రూపంలో ప్రదర్శిస్తూ ఊరేగింపు నిర్వహిస్తామన్నారు.

శనివారం అర్ధరాత్రి పాస్కా జాగరణ, క్రీస్తు పునరుత్థాన, దివ్యబలి పూజ ఉంటాయన్నారు. పవిత్ర ఆదివారం క్రీస్తు పునరుత్థాన మహోత్సవం నిర్వహిస్తామని, ఈ కార్యక్రమాలన్నింటిలో క్రైస్తవ విశ్వాసులు పాల్గొని క్రీస్తు దీవెనలు పొందాలని సూచించారు.

బెటాలియన్‌లో వైద్యశిబిరం

కలికిరి : ఐటీబీపీ 53వ బెటాలియన్ కేంద్రంలో హిమ్‌వీర్ వైఫ్స్ వెల్‌ఫేర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. బెటాలియన్ కమాండెంట్ అమిత్ భాటి ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో ఐటీబీపీ జవాన్‌లు, అధికారుల భార్యలు (హిమ్‌వీర్ వైఫ్స్)కు మహిళా వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని వైద్యాధికారులు సూచించారు.

వేలంపాటతో ఆదాయం

గాలివీడు : మండలంలోని గోరాన్‌చెరువు గ్రామ పంచాయతీ పేరాలగుట్ట సహజ వనరులలో భాగంగా కట్టుడురాయి గేటు వేలం పాటను బుధవారం రాయచోటి డివిజన్ డీఎల్పీ ఆదేశాల మేరకు ఈఓపీఆర్డీ శేఖర్‌నాయక్, సర్పంచ్ సర్పంచ్ దీప్తిల ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి సరోజమ్మ నిర్వహించారు. వేలంపాటలో అత్యధికంగా రూ.1.65 లక్షలు గ్రామానికి చెందిన గుత్తేదారులు దక్కించుకున్నారు. గతేడాది కంటే ఈ ఏడు అదనంగా రూ.50వేలు వేలంపాటలో దక్కడంతో గ్రామస్తులు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. ఏప్రిల్ 1 2024 నుంచి మార్చి 30 2025 వరకు కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యవర్గ సభ్యులు, సచివాలయం సిబ్బంది, వేలంపాట పోటీదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైవీయూ స్నాతకోత్సవానికి దరఖాస్తుల వెల్లువ

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో డిగ్రీ పీజీ, పీహెచ్.డి. పట్టాలు పొందడానికి దరఖాస్తు దారులు వెల్లువెత్తుతున్నారు. విద్యార్థులతో బుధవారం విశ్వవిద్యాలయ ప్రాంగణం కళకళలాడింది. వైవీయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్.ఈశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పటిదాకా వివిధ డిగ్రీల పట్టాల కోసం 10,682 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నారన్నారు. రాబోయే మూడు రోజుల్లో దరఖాస్తుల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉందన్నారు.

వైభవంగా రథోత్సవం

రామసముద్రం : మండలంలోని ఊలపాడు పంచాయతీ నరసాపురం గ్రామంలో వెలసిన శ్రీ ముక్కంటేశ్వరస్వామి తిరునాలలో భాగంగా మంగళవారం రాత్రి వైభవంగా రథోత్సవం నిర్వహించారు. ఈ రథోత్సవానికి ఆంధ్రా, కర్ణాటక నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. భక్తులకు గ్రామస్తులు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమానికి మదనపల్లె వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిస్సార్ అహమ్మద్, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డిలు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. వారికి గ్రామస్తులు మేళతాళతో ఘనంగా స్వాగతం పలికారు.

మతోన్మాద బీజేపీని ఓడించండి

ములకలచెరువు : రాజ్యాంగ హక్కులను మంటగలుపుతున్న మతోన్మాద బీజేపీని ఓడించి దేశాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత కమ్యూనిస్టు పార్టీ నాయకులు, కార్యకర్తలు, పౌరులందరిపైన ఉందని సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్. నరసింహులు పిలుపునిచ్చారు. బుధవారం మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారం చేపట్టి పదేళ్ల సమయం గడుస్తున్నా ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలన్నారు. ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ, ఆ పార్టీకి మద్దతు ఇస్తున్న పార్టీలను బుద్ధి చెప్పాలని సూచించారు. సమావేశంలో నియోజకవర్గ కార్యదర్శి ఎస్.మనోహర్‌రెడ్డి, నాయకులు అంజనప్ప, నరసింహులు, భాస్కర్ తదితరులు ఉన్నారు.

పదిమంది బైండోవర్

బి.కొత్తకోట : పాత కేసుల్లో నిందితులుగా ఉన్న పది మందిని బైండోవర్ చేసినట్టు పోలీసులు బుధవారం తెలిపారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ముందస్తుగా వీరిని బైండోవర్ చేశామని తెలిపారు. ఎన్నికల్లో ఎలాంటి గొడవలు జరగకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

అభివృద్ధి ప్రదాతకు పట్టం కట్టండి

కేవీపల్లె : అభివృద్ధి ప్రదాత రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి పట్టం కట్టాలని పీలేరు, కేవీపల్లె మండలాల వైఎస్సార్‌సీపీ ఎన్నికల ఇన్‌చార్జి పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఎంవీపల్లె పంచాయతీలోని గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి ఆర్థిక లబ్ధి చేకూరిందన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం పలు గ్రామాలకు రోడ్డు సౌకర్యం, మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారు. గ్రామ సచివాలయ వ్యవస్థతో ప్రభుత్వ పాలన ఇంటివద్దకే వచ్చినట్లు చెప్పారు. నిరంతరం ప్రజాసేవకు అంకితమైన రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిని మరోసారి గెలిపించాలని కోరారు.

పేద విద్యార్థులకు ఉచితంగా ఎంసెట్ కోచింగ్



విద్యార్థులకు ఎంసెట్ మెటీరియల్‌ను అందిస్తున్న కళాశాల చైర్మన్ భాస్కర్

రామాపురం : పేద విద్యార్థులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు ఉచితంగా ఎంసెట్ కోచింగ్‌తో పాటు ఉచిత భోజన వసతి కల్పిస్తున్నామని బిట్స్ కళాశాల చైర్మన్ మన్నేరు భాస్కర్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని బండపల్లె పంచాయతీ పరిధిలోని భాస్కర్ ఇంజనీరింగ్ కళాశాలలో పేద విద్యార్థులకు ఎంసెట్ కోచింగ్ మెటీరియల్‌ను ప్రభుత్వ పాలిటెక్నికల్ ఈసీ హెచ్‌ఓడీ మధుసూదన్ రెడ్డితో కలిసి ఉచితంగా పంపిణీ చేశారు. మాట్లాడుతూ ప్రస్తుతం ఇంటర్మీడియట్ చదివిన విద్యార్థులు 200 మందికి ఎంసెట్ కోచింగ్ ఉచితంగా ఇవ్వడంతోపాటు వసతి, భోజనం సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. కోచింగ్ తీసుకున్నప్పటికీ విద్యార్థులకు ఎంసెట్‌లో ర్యాంకు రాకపోతే ఉచితంగా నాలుగేళ్లపాటు ఫీజు లేకుండా ఉచితంగా విద్యను అందించడం జరుగుతుందన్నారు. సీఈసీ, ఈఈఈ, ఏఐ, ఈసీఈ కోర్సులు కళాశాలలో అందుబాటులో ఉన్నాయన్నారు. మంచి ర్యాంకు సాధించిన విద్యార్థులకు ప్రభుత్వ ఆదేశించిన ఫీజును మాత్రమే తీసుకుంటామని, అదనపు ఫీజులు తీసుకోమని తెలియజేశారు. కళాశాలలో అధునాతనమైన కంప్యూటర్స్ ఉండడంతో ఎంసెట్ పరీక్షా కేంద్రాన్ని ప్రభుత్వం మంజూరు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బిట్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, పారా మెడికల్ ప్రిన్సిపాల్ నాగేంద్ర, కళాశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపల్లెలో ముమ్మరంగా ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న మైనార్టీ నాయకులు

నందలూరు(రాజంపేట) : రాజంపేట శాసనసభ అభ్యర్థి ఆకేపాటి అమరనాథరెడ్డిని, పార్లమెంట్ అభ్యర్థి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిలను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు ఆధ్వర్యంలో బుధవారం నాగిరెడ్డిపల్లెలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ముస్లిం సోదరులు ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ ఉపాధ్యక్షులు జాహిద్ అలీ, జామియా మసీద్ ప్రెసిడెంట్ షేక్ హైదర్, మైనార్టీ పట్టణ అధ్యక్షులు మసూద్ అలీఖాన్, నాగిరెడ్డిపల్లి మాజీ వార్డు మెంబర్ మహబూబ్ బాషా, మున్సిపల్ వైస్ చైర్మన్ మున్నా, షఫీ, అలీఖాన్, అక్తర్, అలీ, గౌస్ మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కనీస కూలీ వచ్చేలా పని చేయాలి



కరిరెడ్డిపల్లెలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించిన ఎంపీడీఓ ప్రభాకర్

రామాపురం : మండలంలోని కసిరెడ్డిగారిపల్లె పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను బుధవారం ఎంపీడీఓ ప్రభాకర్ తనిఖీ చేశారు. మాట్లాడుతూ ఉపాధి పనులు సుద్దమళ్ల గ్రామం మినహా మిగిలిన 12 గ్రామాల్లో ఉపాధి పనులు జరుగుతున్నాయని, ఉపాధి పనులు డంపింగ్ యార్డు, చెరువుల్లో పూడికతీత పనులు చేస్తున్నారని, కూలీలు రోజువారి దిన కూలీ కనీసం రూ.272లు పనులు చేయాలన్నారు. కూలీలు ఉదయం 5.30 గంటల నుంచి 10.30 గంటల వరకు పనులు చేయాలని, పనుల్లో నాణ్యత వచ్చే విధంగా చూడాలని ఫీల్డ్ సిబ్బందికి సూచించారు. ప్రస్తుతం మండలం వ్యాప్తంగా 1050 మంది ఉపాధి కూలీలు పనులు చేస్తున్నారని, ఇంకా ఉపాధి పనులు కావాల్సిన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకుంటే వెంటనే పనులు ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. ఆయనతోపాటు ఏపీఓ సురేంద్రనాథరెడ్డి, టీఏలు, ఫీల్డ్‌సిబ్బంది, ఉపాధి కూలీలు ఉన్నారు.

ఎన్నికలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు



ఓటు ఆవశ్యకతను వివరిస్తున్న సీఐ, ఎస్ఐలు



కవాతు నిర్వహిస్తున్న దృశ్యం

పుల్లంపేట : సార్వత్రిక ఎన్నికలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్టు పోలీసులు అన్నారు. బుధవారం మండల పరిధిలోని అనంతసముద్రం, టి.కమ్మపల్లి, టి.బలిజపల్లిలలో రాజంపేట సీఐ మంజునాథ రెడ్డి, ఎస్ఐ రఘురాంల ఆధ్వర్యంలో పోలీసులు, కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని శాంతి భద్రతలను పర్యవేక్షిస్తూ ప్రతి పౌరుడు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సిద్ధం సభకు తరలివెళ్లిన శ్రేణులు



బస్సు యాత్రకు వెళ్తున్న సాయికిషోర్‌రెడ్డి, నాయకులు

ఓబులవారిపల్లె : ఇడుపులపాయ నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన మేమంతా సిద్ధం బస్సు యాత్రకు బుధవారం మండలం నుంచి ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్దఎత్తున వైఎస్సార్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ప్రొద్దుటూరులో జరిగిన బస్సుయాత్ర బహిరంగసభలో సర్పంచ్ మల్లెం ఈశ్వరయ్య, మాజీ సర్పంచ్ ముక్కా రమేష్‌కుమార్‌రెడ్డి, కొర్లకుంట ఉప సర్పంచ్ ముక్కా రూపేష్‌కుమార్‌రెడ్డి, కో–ఆప్షన్ మెంబర్ షేక్ మౌలానా, వైఎస్సార్‌సీపీ నాయకులు దేశయ్య, మారే సుకుమార్, వెంకటేష్, యశ్వంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మారెమ్మకు ప్రత్యేక పూజలు



మారెమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్

మదనపల్లె : మండలంలోని కోటవారిపల్లె తండాలో జరుగుతున్న జాతరలో బుధవారం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి గ్రామస్థుల ఆహ్వానం మేరకు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తండా వారికి ఘనస్వాగతం పలికారు. అనంతరం తండాలోని మారెమ్మ అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులను ఉద్దేశించి నిసార్‌అహ్మద్ మాట్లాడుతూ.. మంచిచేసిన ప్రభుత్వానికి ప్రజలంతా అండగా నిలవాలన్నారు. రానున్న ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి మిథున్‌రెడ్డిని, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కోటవారిపల్లె తండాలోని ప్రజాసమస్యలను పరిష్కరించి అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణల దిశగా పరిశోధనలు

వైవీయూ : నూతన ఆవిష్కరణల దిశగా పరిశోధనలు కొనసాగాలని బెంగళూరుకు చెందిన ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ గౌరవ శాస్త్రవేత్త డాక్టర్ సంజప్ప సూచించారు. కడప నగరంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో 'జీవశాస్త్రంలో ఆధునిక పోకడలు' అన్న అంశంపై బుధవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా డా.సంజప్ప మాట్లాడుతూ విద్యార్థులు పరిశోధనల వైపు రావాలని, దేశానికి ఉపయోగపడే నూతన ఆవిష్కరణల దిశగా అవి సాగాలన్నారు. మరొక శాస్త్రవేత్త డాక్టర్ ఆర్.ఆర్. రావు మాట్లాడుతూ ఇలాంటి వర్క్‌షాప్‌ల్లో పాల్గొనడం ద్వారా నూతన అంశాలను తెలుసుకునే అవకాశం విద్యార్థులు, అధ్యాపకులకు లభిస్తుందన్నారు. వైవీయూ వృక్షశాస్త్ర ఆచార్యులు డాక్టర్ ఎ. మధుసూదన్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్. వెంకట్రామిరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ కె. సూర్యనారాయణరెడ్డి, ఎల్. అనంతలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

హుండీ సొమ్ము లెక్కింపు

కడప కల్చరల్ : కడప నగరంలోని రాజరాజేశ్వరీ దేవి, మోచంపేటలోని ప్రసన్న విశ్వేశ్వరస్వామి ఆలయాల్లో హుండీలను బుధవారం లెక్కించారు. ఆకుల వీధి రాజేశ్వరీదేవి ఆలయంలో 2023 సెప్టెంబరు, 30 నుంచి నేటి వరకు మొత్తం రూ.1,29,185 లభించినట్లు వారు తెలిపారు. మోచంపేట ప్రసన్న విశ్వేశ్వరస్వామి ఆలయంలో గత ఏడాది డిసెంబరు 14వ తేదీ నుంచి నేటి వరకు హుండీ ద్వారా రూ.15,428 లభించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్, కడప నగర గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ కార్యనిర్వహణాధికారి ఎ.శ్రీధర్, ఆలయ మాజీ చైర్మన్ కె.ఉమేష్‌లు పాల్గొన్నారు.